సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో పాల్గొన్న పలువురు ఉభయదాతలు

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏపీ కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


12న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 12న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి పాల్గొనవచ్చని ఆమె పేర్కొన్నారు.

20 నుంచి విద్యార్థి యువజన సమరయాత్ర

డాబాగార్డెన్స్: ప్రత్యేక హోదా, ఆంధ్రప్రదేశ్ హక్కులు, విభజన హామీల కోసం ఈ నెల 20 నుంచి విద్యార్థి యువజన సమరయాత్ర 2.0 నిర్వహించనున్నట్టు విద్యార్థి సంఘాల నాయకులు ఫణీంద్ర, బుల్లిరాజు తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, డివైఎఫ్ఐ, టీఎన్ఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐవైఎఫ్ తదితర విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలతో కలిసి ఈ యాత్ర ఈ నెల 20న హిందూపూర్‌లో ప్రారంభమై ఫిబ్రవరి 4న ఇచ్ఛాపురంతో ముగియనుందని తెలిపారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రత్యేక హోదా, విభజన హామీల కోసం నిరంతరం పోరాటం చేస్తూనే ఉన్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు నమ్మకద్రోహం చేస్తుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ విషయమై స్పందించాలన్నారు. న్యాయమైన హక్కుల సాధనకు పార్టీలకు అతీతంగా సహకరించి, విద్యార్థి యువజన సమరయాత్ర విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏజే స్టాలిన్, ప్రొఫెసర్ అప్పలనాయుడు, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి విశేష అభిషేకాలు



సింహాచలం: విజినిగిరిపాలెంలోని ఉమాచంద్ర మాహేశ్వరస్వామి ఆలయంలో కొలువైన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

యువశక్తి కార్యక్రమానికి తరలి రండి

డాబాగార్డెన్స్: శ్రీకాకుళం జిల్లాలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేపట్టే యువశక్తి కార్యక్రమానికి యువత తరలిరావాలని ఆ పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్ పిలుపునిచ్చారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివినా ఉపాధి లేక యువత ఇబ్బందులు పడుతున్నారని, వారి స్థితిగతులు, పడుతున్న ఇబ్బందులపై నేరుగా వారితో మాట్లాడేందుకు పవన్ కల్యాణ్ యువశక్తి కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో శెట్టిబత్తుల రాజబాబు, బోడసింగి శ్రీధర్, అడబాల లక్ష్మి, ముమ్మిన నాగమణి, వానపల్లి రంగారావు, గోపి, కల్యాణం, చిక్కల భీముడు తదితరులు పాల్గొన్నారు.

ఊరెళ్తున్నారా.. జర భద్రం



ఎల్‌హెచ్ఎంఎస్ యాప్ చిత్రాలు

- నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి
- షాపింగ్‌మాల్స్, ఆర్టీసీ కాంప్లెక్స్, రద్దీ ప్రాంతాల్లో పోలీసుల విస్తృత ప్రచారం
- ఎల్ఎంహెచ్ఎస్ యాప్‌ను వినియోగించుకోండి
- సంక్రాంతి నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అల్లిపురం: సంక్రాంతి పండగ వస్తుందంటే చాలు ప్రతి ఇంట సందడి మొదలవుతుంది. సొంత గ్రామాలకు వెళ్లాలని, కొత్తబట్టలు కొనాలని ఉత్సాహం చూపిస్తుంటారు. చుట్టుపక్కల వారికి.. పోలీసులకు కూడా సమాచారం అందించరు. ఇదే అదనుగా దొంగలు చేతివాటం చూపిస్తుంటారు. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని పోలీసులు నేర నియంత్రణ పట్ల అవగాహన కల్పిస్తున్నారు.

పండగ సమయాల్లో..

- ఇంటి చిరునామా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో తెలియపరచాలి. ఎప్పుడు ఊరు వెళుతున్నదీ.. ఎప్పుడు తిరిగి వస్తున్నది తేదీలతో పాటు తెలపాలి. ఇంటి యజమాని ఫోన్ నంబరు అందజేయాలి. లేదా వాచ్‌మెన్‌ను నియమించాలి
- అపార్ట్‌మెంట్‌లో ఉన్న వారు వాచ్‌మెన్‌ను తప్పకుండా నియమించుకోవాలి. వాచ్‌మెన్ ఫొటో, అడ్రస్ తీసుకోవాలి. కొత్తవారు వచ్చినప్పుడు వాచ్‌మెన్‌తో వారిని ప్రశ్నింపజేయాలి. రిజిస్టర్‌లో వారి పేరు అడ్రస్, ఫోన్ నంబరు, ఎక్కడికి వెళుతున్నది నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలి.
- అపార్ట్‌మెంట్ సెల్లార్‌లోను, ప్రవేశ ద్వారం, కారిడార్‌లోను సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ఇంట్లో ఎక్కువ మొత్తంలో సొమ్ము, బంగారం, వెండి ఆభరణాలు ఉంచరాదు. బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలి.
- ప్రయాణాల్లో విలువైన వస్తువులు బ్యాగుల్లో పెట్టకూడదు. చిన్నపిల్లలు, బ్యాగులను ఎక్కడ పడితే అక్కడ వదిలిపెట్టి వెళ్లకూడదు.

షాపింగ్ చేసేవారు..

- షాపింగ్ చేసేవారు పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి. డబ్బులతో కూడిన బ్యాగులు ఉన్నప్పుడు జాగ్రత్త వహించాలి. రద్దీగా ఉన్న చోట జేబు దొంగలు, బంగారు వస్తువులు దొంగిలించేవారు ఉంటారు. చుట్టుపక్కల వారిని గమనిస్తుండాలి.
- బట్టలు కొనే హడావుడిలో పర్సులు, బ్యాగులు పక్కన పెట్టరాదు. దొంగలు చేతివాటం చూపిస్తుంటారు. అందరూ కష్టమర్లలాగే కనపడతారు. దొంగతనం జరిగిన తరువాత కంటే.. జరగక ముందే జాగ్రత్తలు తీసుకుంటే మంచిది.
- రూ.10, రూ.50, రూ.100 నోట్లు కింద పడేసి, మీ దృష్టిని మరల్చి విలువైన వస్తువులు, తెచ్చుకున్న డబ్బు కాజేసే అవకాశం ఉంటుంది. ముందుగానే జాగ్రత్త పడాలి.
- డిజిటల్ లావాదేవీలకే ప్రాధాన్యత ఇవ్వండి. వీలైనంత వరకు నగదురహిత లావాదేవీలకు మొగ్గు చూపండి. డబ్బు ఉన్నప్పుడు జాగ్రత్త వహించండి. ఇరానీ గ్యాంగ్, చెడ్డీ గ్యాంగ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండండి..



ఆటోలకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్న టూటౌన్ క్రైం ఎస్ఐ శ్రీనివాస్

ఇటీవల నగరంలోని అల్లిపురం, ప్రహ్లాదపురం, గాజువాక ప్రాంతాల్లో ఇరానీ గ్యాంగ్ పేరిట మహిళలు, వృద్ధులు లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు ఆటోలు, మైకుల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

లాక్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్ఎంఎస్) యాప్‌ను ఉపయోగించుకోండి..

తాళం పడితే చాలు.. దొంగలు తమ చేతి వాటం ప్రదర్శించి కన్నం వేస్తారు. చెమటోడ్చి దాచుకున్న డబ్బుని క్షణాల్లో దోచుకెళ్లిపోతారు. ఇల్లు విడిచి బయటికి వెళ్లాలంటే భయపడాల్సిన అవసరం ఇప్పుడు లేదు. సాంకేతికత సాయంతో.. చోరీలకు చెక్ చెప్పే ఆధునిక వ్యవస్థను పోలీసులు నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. పోలీసు శాఖ రూపొందించిన లాక్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్ఎంఎస్) యాప్‌ను ప్రజలు తమ మొబైల్లో డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్టర్ అవ్వాలి. ఇంటికి తాళం వేసి ఎక్కడికైనా వెళ్లే ముందు ఈ యాప్ సహాయంతో పోలీసులకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో పోలీసులు మీ ఇంటి దగ్గర టెక్నాలజీ సాయంతో భద్రత కల్పిస్తారు. ముందుగా గూగుల్ ప్లే స్టోర్‌లో ఎల్‌హెచ్ఎంఎస్ ఏపీపోలీస్ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందులో రిజిస్టర్ అనే ఆప్షన్‌ను ఎంపిక చేసుకుని అందులో ఇంటి అడ్రస్, సెల్ నంబర్‌ను పొందుపరచాలి. రిజిస్టర్ చేసుకున్నాక అందులో ఇచ్చిన నంబర్‌కు వన్ టైం పాస్‌వర్డ్, యూజర్ ఐడీ వస్తుంది. ఎప్పుడైనా ఊరికి వెళ్లినప్పుడు ఈ యాప్‌లోకి వెళ్లి యూజర్ ఐడీని టైప్ చేసి రిక్వెస్ట్ పోలీస్ వాచ్ ద్వారా సమాచారం ఇవ్వాలి. ఫలానా తేదీల్లో ఇంట్లో ఉండటంలేదని సమాచారం టైప్ చేసి సబ్‌మిట్ చెయ్యాలి. సమాచారం అందుకున్న తర్వాత పోలీసులు ఊరికి వెళ్లే ముందు రోజున మీ ఇంటికి వచ్చి వైర్‌లెస్ మోషన్ సీసీ కెమెరాలు, మోడెమ్ మొదలైన పరికరాలు బిగించి వెళ్తారు. అప్పటి నుంచి మీ ఇల్లు పోలీస్ నిఘాలో ఉంటుంది. ఒకవేళ దొంగలు వచ్చి తాళం పగులగొట్టేందుకు ప్రయత్నిస్తే.. అక్కడున్న కెమెరాలో అలారం మోగుతుంది. ఆ సమాచారం వెంటనే పోలీసులకు అందుతుంది. మీరు లేని సమయంలో ఎవరైనా ఇంటికి వస్తే ఆ వీడియోలు, ఫొటోలు సీసీ కెమెరాల సహాయంతో పోలీస్ కంట్రోల్ రూంకి చేరుతాయి. ఇవన్నీ ఈ యాప్‌తోనే సాధ్యమవుతాయి. ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని నగర పోలీసులు కోరుతున్నారు.

నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి



సంక్రాంతికి సొంత గ్రామాలకు వెళ్లే వారు తప్పకుండా తమ సమాచారాన్ని పోలీస్ స్టేషన్‌లో అందజేయాలి. లేదా పోలీస్ యాప్ ఎల్‌హెచ్ఎంఎస్‌ను ఉపయోగించుకోవాలి. అత్యవసరమైనప్పుడు డయల్ 100, 1090కు గాని, టూటౌన్ 0891-2783872, మహారాణిపేట 0891-2746866 నంబర్లలో గాని ఫిర్యాదు చేయొచ్చు. పండగ సంతోషంగా చేసుకోండి.

– కె.శ్రీనివాస్, టూటౌన్ క్రైం ఎస్ఐ

పార్ట్ టైం జాబ్ పేరుతో టోకరా

అల్లిపురం : పార్ట్ టైం ఉద్యోగం పేరిట ఓ వ్యక్తి నుంచి రూ.5.42 లక్షలకు టోకరా వేశారు. విశాలాక్షినగర్‌కు చెందిన ఒక వ్యక్తికి 7086147726 వాట్సాప్ నంబర్ నుంచి మెసేజ్ వచ్చింది. తాను బజాజ్ ఫైనాన్స్ రిసెప్షనిస్ట్‌గా పరిచయం చేసుకుని, ఇంటి వద్ద నుంచే పార్ట్ టైం జాబ్ చేసుకుని డబ్బు సంపాదించుకోవచ్చని తెలిపింది. తాను చేయనని బాధితుడు చెప్పినప్పటికీ అతడిని నమ్మించడం కోసం రూ.100 అకౌంట్‌లో జమ చేసింది. దీంతో అది నిజమని నమ్మిన అతను టాటింగ్ చేయడం మొదలుపెట్టాడు. తర్వాత బాధితుడికి సుమారు రూ.400 అకౌంట్‌లో జమ అయింది. తరువాత రూ.54,000 పెట్టి ఐటెమ్స్ కొనాలని అందుకుగాను 30 శాతం కమీషన్‌తో కలిపి రూ.70,200 వస్తుందని చెప్పింది. దీంతో బాధితుడు పలు దఫాలుగా రూ.5.42 లక్షలు చెల్లించాడు. నగదు విత్ డ్రా చేసుకోవాలంటే మరి కొంత మొత్తం డిపాజిట్ చేయాలని చెప్పడంతో మోసపోయానని గ్రహించి సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్టు సీఐ కె.భవానిప్రసాద్ తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే పార్ట్ టైం జాబ్ మెసేజ్‌లను నమ్మవద్దని ఆయన హెచ్చరించారు. అలా వచ్చినట్లయితే టోల్ ఫ్రీ నంబర్ 1930 లేదా సైబర్ క్రైం నంబర్ 9490617917కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

సత్యదేవుని హుండీ ఆదాయం రూ.9.22 లక్షలు



నగదు లెక్కిస్తున్న సిబ్బంది

దాబాగార్డెన్స్: ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయ హుండీ లెక్కింపు మంగళవారం చేపట్టారు. హుండీల ద్వారా రూ.9,22,550 ఆదాయం వచ్చింది. హుండీ లెక్కింపులో ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్, పర్యవేక్షణ అధికారి, కరకచెట్టు పోలమాంబ ఆలయ ఈవో సురేష్‌బాబా, ఆలయ ప్రధాన అర్చకుడు పి. నరసింహాచార్యులు పాల్గొన్నారు.

దారి దోపిడీకి పాల్పడిన ముగ్గురి అరెస్టు

అల్లిపురం: దారి దోపిడీకి పాల్పడిన ముగ్గురు యువకులను టూటౌన్ క్రైం పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రియల్‌మీ 8ఐ సెల్‌ఫోన్, రూ.7,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. క్రైం ఎస్ఐ కె.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 6వ తేదీ రాత్రి 8.30 గంటల సమయంలో కృష్ణా జిల్లా, కృతివెన్ను మండలం, మట్లం గ్రామానికి చెందిన బస్వాని రాజ్‌కుమార్, అతని స్నేహితుడు రైల్వేస్టేషన్ ఎదురుగా గల బస్టాప్‌లో వేచి ఉండగా ఆరిలోవ సుందరయ్య కాలనీకి చెందిన షేక్ మొహమ్మద్ వల్లీ, బుద్దల జగదీష్ అలియాస్ జగ్గు, రాయతి ధనరాజు అలియాస్ కామరాజు వారిని బెదిరించి వారి వద్ద నుంచి రియల్‌మీ 8 ఐ సెల్‌ఫోన్, రూ.8 వేల నగదు, అతని స్నేహితుని వద్ద నుంచి రూ.500 దోచుకుని వెళ్లిపోయారు. దీంతో బాధితుడు రాజ్‌కుమార్ టూటౌన్ పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసిన ఎస్ఐ శ్రీను క్రైం డీసీపీ, సీసీఎస్ ఏడీసీపీ, క్రైం ఏడీసీపీల సహకారంతో నిందితులు ముగ్గురిని సోమవారం రాత్రి 9 గంటలకు సరస్వతీ పార్కు వద్ద అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా నిందితులు ముగ్గురు నేరాలకు అలవాటు పడినవారు. వారిలో ప్రధాన నిందితుడు షేక్ మొహమ్మద్ వల్లీ ఆరిలోవ పీఎస్‌లో డీసీ షీటు, రౌడీ షీట్ కలిగి వున్నారు. గతంలో ఆస్తి నేరాలు, శారీరక నేరాలు, ఎన్‌డీపీఎస్ కేసుల్లో ప్రమేయం ఉందని తెలిపారు. మద్యం, గంజాయి, ధూమపానం వంటి వాటికి అలవాటు పడ్డాడని పేర్కొన్నారు. రెండవ నిందితుడు బుద్దల జగదీష్ అలియాస్ జగ్గుపై శారీరక నేరాలు, త్రీటౌన్, ఆరిలోవ పోలీస్‌స్టేషన్లలో హత్యాయత్నం కేసులు నమోదయ్యాయని తెలిపారు. మూడవ ముద్దాయి రాయతి ధనరాజు అలియాస్ కామరాజుపై వన్‌టౌన్, టూటౌన్, పోర్టు టౌన్, కంచరపాలెం పోలీస్ స్టేషన్లలో ద్విచక్రవాహనాల దొంగతనాల కేసులు ఉన్నాయన్నారు. ముగ్గురు తేలిగ్గా డబ్బు సంపాదించేందుకు దారి దోపిడీలు తదితర నేరాలకు పాల్పడుతున్నారని వివరించారు.

రాత్రి పూట దొంగతనాలు చేసే వ్యక్తి అరెస్టు

రాత్రి పూట ఇళ్లలో దూరి దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని టూటౌన్ క్రైం పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. టూటౌన్ క్రైం ఎస్ఐ కె.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం దావులమదుం దరి భూపేష్‌నగర్‌లో ఎండీ ఆలాగర్ హుస్సేన్ తన కుటుంబంతో కలసి నివసిస్తున్నాడు. అయితే ఈ నెల 4వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో కాకినాడ జిల్లా, దువ్వలపేటకు చెందిన సోడిశెట్టి సతీష్ వారి ఇంట్లోకి ప్రవేశించి 3 జతల వెండి పట్టీలు, రెండు వెండి ఉంగరాలు, 50 తులాల వెండి కడియాలు, రూ.2 వేల నగదు దోపిడీకి పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన క్రైం పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడని ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల ప్రాంతంలో దావులమదుం వద్ద అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి మూడు జతల పట్టీలు, రెండు వెండి ఉంగరాలు, రూ. 28 వేల నగదుతో పాటు ద్వారకా పోలీస్ స్టేషన్ క్రైంకు సంబంధించి 11 గ్రాముల బంగారు సూత్రాలు, ఎంవీపీ పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన కేసులో 27.2 గ్రాములు బంగారు గొలుసు, 5.9 గ్రాముల రెండు బంగారు గాజులు, 9.7 గ్రాముల 6 లాకెట్లు, 10.6 గ్రాముల ఒక జత చెవిదుద్దులు స్వాధీనం చేసుకున్నారు. నిందితునిపై తూర్పు గోదావరి జిల్లాలో 15కి పైగా ఆస్తి నేరాలకు పాల్పడినట్లు కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించండి



మత్స్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మధుసూదన రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కోలా గురువులు

అల్లిపురం : రాష్ట్రంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు, రాష్ట్ర పశు సంవర్ధకశాఖ, డెయిరీ అభివృద్ధి, మత్స్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.మధుసూదనరెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఇటీవల నూతనంగా నియమితులైన మధుసూదనరెడ్డిని ఆయన మంగళవారం విజయవాడలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని సత్కరించారు. అనంతరం ఆయన మత్స్యకారుల సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఆయిల్ సబ్సిడీ విడుదల చేయాలని, సముద్రంలో మునిగిపోయిన బోట్లు, హార్బర్‌లో కాలిపోయిన బోట్లకు పరిహారం త్వరగా చెల్లించాలని కోరారు. మత్స్యకారులకు సబ్సిడీపై వలలు, ఇంజిన్లు, తెప్పలు అందించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన ఈ సమస్యలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని కోలా గురువులు తెలిపారు.

స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా త్రినాథరావు



స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ నూతన కమిటీ సభ్యులు

దాబాగార్డెన్స్: విశాఖపట్నం స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎం. త్రినాథరావు నియమితులయ్యారు. దాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎం. ఉషారాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో లయన్ పీడీజీ వెలగపూడి ఉమామహేశ్వరరావు నూతన పాలకవర్గాన్ని ప్రకటించారు. ఎం. త్రినాథరావును అధ్యక్షుడిగా, వి. వల్లికుమారిని కార్యదర్శిగా, ఐ. సత్యనారాయణరాజును కోశాధికారిగా ఎన్నుకోగా.. పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా త్రినాథ్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో గొప్ప అవకాశం కల్పించిన లయన్స్‌క్లబ్ గౌరవ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎ. గోపాలరావు, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎన్‌వీఎస్ఎస్ ప్రసాద్, రీజియన్ చైర్‌పర్సన్ పి. శారద, జోనల్ చైర్‌పర్సన్ ఎస్. రోహిణిరాజు, న్యాయ విభాగ చైర్మన్ ఎస్ఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

చురుగ్గా జగనన్న విద్యాదీవెన సర్టిఫికెట్ల పరిశీలన



విద్యాదీవెన వెరిఫికేషన్ సర్టిఫికెట్లు విద్యార్థులకు అందజేస్తున్న పీవీ కిరణ్‌కుమార్, రంధి గోపి



బంగారుమెట్టలో కన్వీనర్లను వలంటీర్లు, సెక్రటరీలకు పరిచయం చేస్తున్న రంధి

అల్లిపురం: డిగ్రీ ఇతర సాంకేతిక విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన వెరిఫికేషన్ మంగళవారం చురుగ్గా జరిగింది. జోన్-4 గౌరీ స్ట్రీట్ సచివాలయంలో బ్యాంక్ అకౌంట్, ఆధార్ ఇతర వివరాలు 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి లబ్ధిదారులకు 33వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంధి గోపి, సచివాలయ సెక్రటరీ పీవీ కిరణ్‌కుమార్, వలంటీర్ నాగలక్ష్మి, కావేరి వెరిఫికేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఇదిలా ఉండగా ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున బంగారుమెట్ట సచివాలయం పరిధిలో ముగ్గురు కన్వీనర్లను నియమించిన విషయం తెలిసిందే. ఈ మేరకు సంబంధిత కన్వీనర్లు.. వలంటీర్లకు మధ్య సమన్వయ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ కన్వీనర్లు వేగి వెంకటప్పారావు, కణితి బ్రహ్మం, కొల్లి సత్యవతిలను సెక్రటరీలు, వలంటీర్లకు పరిచయం చేశారు.

అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రజా ప్రయోజన పథకాలను వలంటీర్లు, సచివాలయ కార్యదర్శులతో సమన్వయం కుదుర్చుకుని సజావుగా అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 33వ వార్డు మహిళా కార్యకర్తలు లక్ష్మీకాంతం, గంగ, కళ పాల్గొన్నారు.

సిటు మహాసభలు విజయవంతం చేయాలి



పతాకావిష్కరణలో సిటు నాయకులు

దాబాగార్డెన్స్: ఈ నెల 17 నుంచి 22 వరకు బెంగళూరులో జరగనున్న సిటు అఖిలభారత 17వ మహాసభలను విజయవంతం చేయాలని విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సిటు కార్యాలయం వద్ద సీనియర్ నాయకుడు కె. స్వతంత్రకుమార్‌చే పతాకావిష్కరణ చేయించారు. అనంతరం కుమార్ మాట్లాడుతూ జాతీయ మహాసభలు విజయవంతం చేయాలని దేశ వ్యాప్తంగా పతాకావిష్కరణ కార్యక్రమం చేపట్టామని, దీనిలో భాగంగానే విశాఖలో కూడా పతాకావిష్కరణ జరిగిందన్నారు. కార్యక్రమంలో బి. మణి, జగన్, ఎం. సుబ్బారావు, వై. రాజు, పోతేశ్వరరావు, చంద్రమౌళి, టి. నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కళల్లోనూ రాణించాలి



తాము వేసిన చిత్రాలతో విద్యార్థులు

దాబాగార్డెన్స్: వివేకానందుడి జయంతి ఉత్సవాల్లో భాగంగా స్వామి వివేకానంద సంస్థలో మంగళవారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో పోటీలో పాల్గొన్నారు. సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా డ్రాయింగ్ పోటీల్లో పాల్గొని మంచి బొమ్మలు వేశారన్నారు. చదువుతో పాటు విద్యార్థులకు ఏదో ఓ కళలో ప్రావీణ్యం ఉండాలన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

కాళీయ మర్దనుడిగా అప్పన్న

సింహాచలం: సింహగిరిపై నిర్వహిస్తున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వరాహ లక్ష్మీనృసింహస్వామి కాళీయ మర్దనుడిగా దర్శనమిచ్చాడు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని కాళీయమర్దనుడిగా అలంకరించి శ్రీదేవి,భూదేవి సమేతంగా పల్లకిలో వేంచేయజేశారు. ఆళ్వారులను మరో పల్లకిలో అధిష్ఠంపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు.

మామ, బావమరిదిపై దాడి



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అప్పారావు

అల్లిపురం : సొంత మామ, బావమరిదిపై ఇంటి అల్లుడు హత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం రాత్రి టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ బి.తిరుపతిరావు తెలిపిన వివరాల ప్రకారం అల్లిపురం, నేరెళ్లకోనేరు ప్రాంతానికి చెందిన రూకూరి అప్పారావు ఫ్యాన్సీ షాపు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆఖరి కుమార్తె లక్ష్మీబాయిని దువ్వాడకు చెందిన ఆకుల పూర్ణచంద్రరావుకు ఇచ్చి వివాహం జరిపించారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొన్నాళ్ల తర్వాత పూర్ణచంద్రరావు తన భార్యను అనుమానించి వేధించేవాడు. దీంతో వారిద్దరి మధ్య విభేదాలు రావటంతో వేర్వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలో పిల్లల పోషణ నిమిత్తం డబ్బులు ఇవ్వాలంటూ లక్ష్మీబాయి భర్తను అడిగింది. పూర్ణచంద్రరావు అందుకు నిరాకరించాడు. పైగా సోమవారం ఉదయం తన మామగారింటికి వచ్చి అందర్నీ బెదిరించాడు. రాత్రి 10 గంటలకు మరోసారి పూర్ణచంద్రరావు మద్యం తాగి వచ్చి గొడవకు దిగాడు. ఇదంతా గమనించిన అప్పారావు కలుగజేసుకుని పూర్ణచంద్రరావును అక్కడి నుంచి వెళ్లిపోవాలని చెప్పాడు. దీంతో బీరుసీసాతో అప్పారావుతో పాటు, ఆయన కుమారుడు అయ్యప్పపై దాడి చేశాడు. వారు తీవ్రగాయాలతో అక్కడే కూలబడిపోయారు. సమాచారం అందుకున్న ఎస్ఐ విజయకుమార్ ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన అప్పారావు, అయ్యప్పలను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

22 నుంచి రాజశ్యామల నవరాత్రి ఉత్సవాలు

సీతంపేట: రాజశ్యామల మాత నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 22 నుంచి ఎంవీపీ కాలనీ సెక్టార్-11లో నిర్వహించనున్నామని మాతా శారదా ఫౌండేషన్ చైర్మన్ ఆచార్య గురవరేణ్య కుమార స్వామీజీ తెలిపారు. పౌర గ్రంథాలయంలో పెదపూడి ప్రశాంత్‌కుమార్, మందా మల్లేశ్వరి, శంకర్ దేవర, మును పల్లతో కలిసి ఉత్సవాల బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు.

ఆచార్య కేవీ మృతి పట్ల సీపీఐ సంతాపం



ఆచార్య వెంకటేశ్వర్లు (ఫైల్)

అల్లిపురం: ఆంధ్ర విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర విశ్రాంత ఆచార్యులు కె.వెంకటేశ్వర్లు (కేవీ 88) మంగళవారం రాజమండ్రిలో మృతి చెందారు. ఈ మేరకు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి తన ప్రగాఢ సానుభూతిని ఒక ప్రకటనలో ప్రకటించారు. వెంకటేశ్వర్లు ఏయూలో వార్డెన్‌గా, ప్రిన్సిపాల్‌గా, సిండికేట్ సభ్యుడిగా, ఆచార్యులుగా విధులు నిర్వహించారని పేర్కొన్నారు. వీరికి ఒక కుమార్తె లక్ష్మి, కుమారులు రజని, శ్రీనివాస్ ఉన్నారని తెలిపారు. ఈయన సతీమణి గతంలో మరణించారన్నారు. నిబద్ధత గల వామపక్షవాదిగా గొప్ప రాజనీతి ఆచార్యులుగా ప్రసిద్ధి పొందారన్నారు. వీరి మరణం పట్ల సీపీఐ తరఫున ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అదే విధంగా ఆచార్య కేవీ మృతికి ఆయన అనుంగ శిష్యుడు ఆచార్య చుండు సుబ్రహ్మణ్యం సంతాపం తెలిపారు. ఏయూలో ఏఐఎస్ఎఫ్ నాయకుడిగా ఉన్న తమ లాంటి వారిని ఉన్నత విద్య కోసం ప్రోత్సహించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు.